అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
బుధవారం 19 జులై 2023

భారీ వర్షానికి తెగిన రోడ్డు

గ్రామాల మధ్య నిలిచిన రాకపోకలు

నవతెలంగాణ-రాజంపేట్

మండలంలోని రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి కొండాపూర్, ఎల్లారెడ్డిపల్లి గ్రామాల మధ్య నిర్మిస్తున్నటువంటి బ్రిడ్జ్ పనుల నిమిత్తం వాహనాదారుల రాకపోకలకు గాను మట్టి రోడ్డును అధికారులు వేశారు. దీంతో రాత్రి కురిసిన వర్షానికి మట్టి రోడ్డు కాస్త వరదకు తెగిపోయింది. దీంతో రాజంపేట్ బసవన్నపల్లి, ఆర్గొండ, గ్రామాల మీదుగా వెళ్లవలసిన వాహనాదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొస్తుంది. దీంతో గ్రామస్తులు అధికారులకు తెలియజేయగా వారు స్పందించి మరమత్తు పనులు చేపడుతున్నారు.



మధ్యలో నుంచి తెగిపోయిన మట్టిరోడ్డు

కాంట్రాక్టు ప్రొఫెసర్లు వినూత్న నిరసన

నవతెలంగాణ-భిక్కనూర్

మా సేవలను గుర్తించండి అంటూ కాంట్రాక్టు ప్రొఫెసర్లు వినూత్న నిరసన నిర్వహించారు. మంగళవారం తెలంగాణ విశ్వ విద్యాలయం సౌత్ క్యాంపస్‌లో కాంట్రాక్టు ప్రొఫెసర్లు గొడుగులు పట్టుకొని నిరసన కార్యక్రమాలు చేపట్టారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు నారాయణ గుప్తా మాట్లాడుతూ మంత్రి మండలి సబ్ కమిటీని వెంటనే ఏర్పాటు చేసి, రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాలలో సుమారు 1445 మంది కాంట్రాక్టు ప్రొఫెసర్ల సేవలు గుర్తించాలని డిమాండ్ చేశారు. జీవో 16 ప్రకారం రెగ్యులరైజ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు ప్రొఫెసర్లు యాలాద్రి, నరసయ్య, సునిత, వైశాలి, రమాదేవి, నిరంజన్ శర్మ శ్రీకాంత్, దిలీప్, తదితరులు పాల్గొన్నారు.



వర్షంలో గొడుగులు పట్టుకొని నిరసన

వర్షం.. హర్షం

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా జోరుగా వర్షాలు
- లోటు ప్రాంతాల్లో జల సిరులు
- సాగుకు సిద్ధమవుతున్న రైతాంగం
- ఏకధాటి వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

తీవ్ర వర్షాభావ పరిస్థితులతో తల్లడిల్లుతున్న ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వర్షంతో పులకించింది. నర్రెలు బారుతున్న నేలపై చిరుజల్లులు కురవడంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం రాత్రి మొదలైన వర్షం.. మంగళవారం రాత్రి వరకూ కొనసాగుతోంది. మరో మూడు రోజులూ వర్షాలు ఉన్నాయనే వాతావరణ శాఖ సూచనలతో ప్రజల్లో ముఖ్యంగా రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఇప్పటికే రెండు జిల్లాలో లోటు వర్షపాతం నెలకొన్న మండలాలు సాధారణ స్థితికి చేరాయి. మరో మూడు రోజులు ఇదే విధంగా వర్షాలు కురిస్తే వాగులు, వంకలు నిండుతాయని భావిస్తున్నారు.

నిజామాబాద్ జిల్లావ్యాప్తంగా మంగళవారం 4.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. ఈ సీజన్‌లో ఇదే అత్యధిక వర్షపాతం. జూన్ మొదటి వారం నుంచి వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతాంగంలో ప్రస్తుతం సంతోషం వ్యక్తమవుతోంది. జిల్లాలో అత్యధికంగా భీంగల్‌లో 7.1 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. ఆ తరువాత వేల్పూరు(6.0), నవీపేట్ 5.6, మోర్తాడ్ 5.4, ధర్పల్లి 5.2, బాల్కొండ 4.9, మెండోరా, రెంజల్ 4.8, ఏర్గట్ల 4.7, కమ్మర్‌పల్లి 4.6, మాక్లూర్, నిజామాబాద్ నార్త్, బోధన్, మోపాల్‌లో 4, నందిపేట్, ఆర్మూర్, కోటగిరిలో 3.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. ప్రస్తుతం జిల్లాలో 25 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదయ్యింది. మూడు మండలాల్లో



కోర్టు చౌరస్తా వద్ద నిలిచిన నీరు

అధిక వర్షపాతం నమోదయ్యింది. కేవలం 5 మండలాల్లో మాత్రమే లోటు నెలకొంది.

కామారెడ్డి జిల్లావ్యాప్తంగా మంగళవారం 35.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది.
అత్యధి కంగా
మాచారెడ్డి 6



సాలూర వద్ద మంజీరాకు జలకళ

సెంటీమీటర్లు, పాల్వంచ 5.6, రామారెడ్డి 4.9, దోమకొండ 4.8, బీబీపేట 4.7, కామారెడ్డి, గాంధారి 4.6, తాడ్వాయి 4.5, రాజంపేట 4.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. మొన్నటి వరకు మెజార్టీ మండలాల్లో లోటు వర్షపాతం నమోదు కాగా.. ప్రస్తుతం 13 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదయ్యింది. కేవలం 8 మండలాల్లో మాత్రమే లోటు వర్షపాతం నెలకొంది. ఇక మూడు మండలాల్లో అధిక వర్షపాతం నమోదు కావడం విశేషం. జిల్లాలో పత్తి సాగు చేస్తున్న రైతులు వర్షాభావ పరిస్థితులతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరో మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయన్న వార్తల నేపథ్యంలో రైతుల నుంచి సంతోషం వ్యక్తమవుతోంది.

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

జిల్లాలో ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాలను దృష్టిలో పెట్టుకుని అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల తాకిడితో ఎక్కడ కూడా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అవసరమైన ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్ని మండలాల ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని నివాస ప్రాంతాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. చెరువులలో వచ్చి చేరుతున్న నీటి నిల్వలను నిరంతరం పర్యవేక్షిస్తూ, చెరువులకు గండ్లు పడకుండా అప్రమత్తతో కూడిన చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఎక్కడైనా వర్షాల వల్ల ప్రజలకు ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉన్నట్లు గుర్తిస్తే ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.





పోలీసు పహారాలో పారిశుధ్య పనులు

- జీపీ కార్మికుల, సీఐటీయూ నాయకుల అరెస్ట్



నవీపేట్‌లో పోలీసుల పహార మధ్య పనులు

నవతెలంగాణ-నవీపేట్/ఎడపల్లి/కంఠేశ్వర్

జీపీ కార్మికుల సమ్మెపై పాలకులు ఉక్కుపాదం మోపుతున్నారు. కార్మికులను, సీఐటీయూ నాయకులను అరెస్ట్ చేయించారు. పోలీసుల పహార నడుమ ప్రయివేటు సిబ్బందితో పారిశుధ్య పనులు చేపట్టడం గమనార్హం. నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండల కేంద్రంలో పోలీసు పహారాలో పారిశుధ్య పనులు చేయించారు. 56 మంది కార్మికులను, సీఐటీయూ నాయకులను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ సతీష్, రాజారెడ్డి ఆధ్వర్యంలో కార్మికులను అరెస్టు చేసి ప్రయివేట్ కూలీలతో గ్రామంలో పేరుకుపోయిన చెత్తను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఏటీఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజారోగ్యం దృష్ట్యా ప్రైవేటు, ఉపాధి కార్మికులతో యుద్ధ ప్రాతిపదికన అధికార యంత్రాంగం సహకారంతో పారిశుధ్య పనులను చేయించినట్టు తెలిపారు.

జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎమ్మెల్యే ఇంటి ముట్టడికి తరలకుండా పలువురు నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. సీఐటీయూ నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్‌తో పాటు నవీపేట్ నుంచి సీఐటీయూ నాయకులు ఏటీఎస్ శ్రీనివాస్‌తో నాయకులను ముందస్తు అరెస్ట్



సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్‌ను ముందస్తు అరెస్ట్

చేసి స్టేషన్‌కు తరలించారు. అదే విధంగా ఎడపల్లిలో సమ్మెలో కూర్చున్న కార్మికులను, కారోబార్లతో పాటు తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ యూనియ న్ జెఏసి కమిటీ ఉమ్మడి జిల్లాల కన్వీనర్ జంగం గంగాధర్‌ను ముందస్తు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు

అక్రమ అరెస్టుల ద్వారా ఉద్యమాలను ఆపలేరు అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న గ్రామపంచాయతీ సమ్మెలో భాగంగా జిల్లాలో నిర్వహిస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల పోరాటాన్ని నీరుగార్చేందుకు మంగళవారం ఉదయం నుండి వివిధ మండలాల్లో గ్రామపంచాయతీ కార్మిక సంఘం నాయకులతో పాటు సిఐటియు నాయకులను అక్రమంగా అరెస్టు చేసి నిర్బంధించటం సరైంది కాదని పోలీసులు ప్రభుత్వం తమ వైఖరిని మార్చుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల పోరాటానికి సిపిఎం సంపూర్ణ మద్దతును ప్రకటిస్తుందని తెలిపారు.

పని దినాలు పెంచండి..

- శివాజీ బీడీ యాజమాన్యంతో సీఐటీయూ నాయకులు
- కార్మిక శాఖ అధికారుల సమక్షంలో చర్చలు



అధికారుల సమక్షంలో చర్చలు చేపట్టిన సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి

బీడీ కార్మికులకు పని దినాలు పెంచడంతో పాటు కొత్తవారికి పీఎఫ్ నంబర్ ఇవ్వాలని శివాజీ బీడీ యాజమాన్యానికి సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కామారెడ్డిలోని కార్మిక శాఖ అధికారుల సమక్షంలో యజమాన్యానికి, సీఐటీయూ నాయకులకు మధ్య చర్చలు జరిగాయి. ఈ చర్చల్లో తెలంగాణ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.చంద్రశేఖర్‌తో పాటు నాయకులు సత్యం, రాజనర్సు తదితరులు పాల్గొన్నారు. శివాజీ బీడీ కంపెనీలో కార్మికుల సంక్షేమం కోసం జులై 1వ తేదీన కార్మిక శాఖ కార్యాలయంలో మూడు డిమాండ్లపై సీఐటీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. కొత్తవారికి పీఎఫ్ నంబర్‌తో పాటు పని దినాలు పెంచాలని, కార్మికులకు సరిపడా ఆకు, తంబాకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మూడు డిమాండ్లపై మంగళవారం చర్చలు జరిగాయి. అయితే ఈ డిమాండ్లపై యజమాన్యంతో చర్చించి చెబుతామని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. తదుపరి సమావేశం ఈ నెల 24వ తేదీన సోమవారం జరగనుంది.

అటవీ భూములు దున్నితే చట్ట రీత్యా చర్యలు

ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సంతోష్



గిరిజనులతో మాట్లాడుతున్న అటవీశాఖ అధికారులు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

కొత్తగా ఆటవీ భూములు దున్నితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సంతోష హెచ్చరిం చారు. మండలంలోని పోచారం, విట్టల్ వాడి, విట్టల్ వాడి తండాల మధ్యలో గల అటవీ భూములను రెండు రోజుల క్రితం దున్నడంతో ఘర్షణ వాతావరణం నెలకొన్న విషయం తెలిసిందే. సమాచారాన్ని తెలుసుకున్న అటవీశాఖ అధికారులు విట్టల్వాడి గ్రామంలో మంగళవారం గిరిజనులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పోడు భూముల పట్టాలు రాని వారు ఇదే ఆసరాగా తీసుకొని అటవీ భూములను దున్నినా నేరమని తెలిపారు. అదేవిధంగా కొత్తగా పోడు భూమి పట్టాలు వచ్చినవారు ఇష్టానుసారంగా దున్నుకోవద్దని పట్టాలు ఇచ్చిన దాంట్లోనే ఉండాలని మళ్లీ కొత్తగా భూములను దున్నితే లేదా ఫారెస్ట్ భూమిని స్వాధీనం చేసుకునేలా వ్యవహరిస్తే అలాంటి వారిపై అటవీ శాఖ చట్టం కింద నిబంధనల మేరకు చర్యలు తప్పవన్నారు. ఎవరైనా పోడు భూములు పట్టాలు కాకుండా ఫారెస్ట్ భూమిని దున్నితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌ఓ సంతోష, అటవీ శాఖ అధికారి సుజాత, ఎమ్మార్వో దశరథ్, ఎస్సై కోనారెడ్డి, ఎంపీఓ సురేకాంత్, ఏఎస్ఐ రాములు, రైతులు పాల్గొన్నారు.

వర్షాన్ని సైతం లెక్కచేయకుండా..

- రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ఎదుట జీపీ కార్మికుల, నాయకుల ధర్నా
- జీపీ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

పంచాయతీ కార్మికుల సమ్మెపై సర్కారు సైలెంట్‌గా ఉంటూ అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని అణచివేయాలని చూడడం అవివేకమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన అన్నారు. జీపీ కార్మిక జేసీసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట కార్మికులు, నాయకులు మంగళవారం పెద్దఎత్తున ధర్నా చేపట్టారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పెద్ద సంఖ్యలో కార్మికులు, నాయకులు ధర్నా చేపట్టి నినాదాలు చేశారు. వీరి సమ్మెకు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా జేసీసీ నాయకులు సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్, ఐ ఎఫ్ టి యు జిల్లా కార్యదర్శి సుధాకర్, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు జేపీ గంగాధర్ మాట్లాడారు. గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికై జూలై 6 నుండి జరుగుతున్న సమ్మెకు నివారణ చర్యలు చేపట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కి తమరి ద్వారా లేఖ రాయాలని ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందించేందుకు వచ్చినట్టు తెలిపారు. 20-30 సంవత్సరాలుగా పనులు చేస్తున్నప్పటికీ పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయడం లేదని, వారి పనికి గుర్తింపు, పని భద్రత, కనీస వేతనాలు, పి.ఎఫ్. ఇ.ఎస్.ఐ, ప్రమాద బీమా లాంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని అన్నారు.

గ్రామ పంచాయతీ సిబ్బందినందరిని పర్మినెంట్ చేయాలని, పి.ఆర్.సిలో నిర్ణయించిన బేసిక్ ప్రకారం పంచాయతీ సిబ్బందికి రూ.19,000/-లు చెల్లించాలని, ఆ లోపు జీ.వో. నెం. 60లో పేర్కొన్న వేతనాలను కేటగిరీల వారీగా పంచాయితీ సిబ్బందికి నెలకు రూ. 15,600/-లు కారోబార్, బిల్ కలెక్టర్లకు, ఇతర స్కిల్ సిబ్బందికి రూ. 19,500/-లు చెల్లించాలని, కారోబార్, బిల్ కలెక్టర్లకు, అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శులుగా ప్రమోషన్ ఇవ్వాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతిలోనే వివిధ కేటగిరీలను యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు కటారి రాములు, ఐఎఫ్టియు జిల్లా నాయకులు శివ, భూమన్న ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు వెంకన్న మురళి పంచాయతీ యూనియన్ జిల్లా అధ్యక్షులు రాజేష్ గంగారాం కరోబార్ యూనియన్ జిల్లా నాయకులు నందు, సావిత్రి, ప్రదీప్, ధర్మన్న సాయిలు, లక్ష్మీ సుజాత సాయమ్మ, తదితరులు పాల్గొన్నారు.



నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట పెద్దఎత్తున ఆందోళన చేపట్టిన నాయకులు, కార్మికులు



నవీపేట్‌లో జీపీ కార్మికుల, నాయకుల అరెస్టు

కార్మిక వ్యతిరేకులుగా చరిత్రలో మిగిలిపోతారు : నాయక్ వాడి శ్రీనివాస్

నవీపేట్ : పారిశుధ్య కార్మికులు చట్టబద్ధంగా న్యాయమైన డిమాండ్ల కోసం సమ్మె చేస్తుంటే పోలీసు పహారాలో కార్మికులను అరెస్టు చేసి పోటీ కార్మికులతో సఫాయి పనులను పాలకవర్గం చేయడం చరిత్రలో కార్మిక వ్యతిరేకులుగా మిగిలిపోతారని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నాయక్ వాడి శ్రీనివాస్ అన్నారు. సమ్మె 13వ రోజు సందర్భంగా నవీపేట్‌లో పోలీసులు రాత్రి మూడు గంటల తర్వాత మహిళా కార్మికులని చూడకుండా ఇంట్లోకి చొరబడి అరెస్టు చేయడం హేయమైన చర్య అని అన్నారు. 56 మంది కార్మికులపై 150 సి ఆర్ పి ప్రకారం కేసులు నమోదు చేయడం పట్ల ప్రభుత్వం, పాలకవర్గం కార్మికులపై ప్రతీకార చర్యలకు పూనుకున్నారని నిర్బంధాలతోటి పోరాటాన్ని ఆపలేరని అన్నారు.ఈ కార్యక్రమంలో దేవేందర్ సింగ్, లక్క గంగారం, ఆంజనేయులు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లు తెగిపడి గొర్రెలు మృత్యువాత

నవతెలంగాణ-భిక్కనూర్

ప్రమాదవ శాత్తు విద్యుత్ వైర్లు తెగిపడి ఆరు గొర్రెలు మృతి చెందిన ఘటన మండలంలోని జంగంపల్లి గ్రామంలో మంగళ వారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నరసయ్య తన గొర్రెలను మేతకు తీసుకెళ్లారు. అక్కడ గొర్రెలు మేతమేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ మెన్ వైర్లు తెగిపడి గొర్రెలపై పడడంతో గొర్రెలకు షాక్ తగిలి ఆరు గొర్రెలు మరణించాయి. సమాచారం అందుకున్న గ్రామ సర్పంచ్ నరసిములు సంఘటన స్థలానికి చేరుకొని మృతి చెందిన గొర్రెలను పరిశీలించి విద్యుత్ అధికారులతో పాటు పశు వైద్యాధికారులకు సమాచారం అందించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామ సర్పంచ్ కోరారు.



మృత్యువాత పడ్డ గొర్లు

క్రీడా సౌకర్యాలు లేకున్నా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ సర్కిల్లో క్రీడలకు పెద్దపీటవేసి సరియైన సౌకర్యాలు లేకున్నా క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో, జాతీయ స్థాయిలో రాణిస్తున్నా రని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్ రావు అభినందించారు. రాష్ట్రస్థాయి ట్రాన్కో, డిస్కస్ ఇంటర్ సర్కిల్ ఫుట్బాల్ అండ్ క్యారమ్స్ టోర్నమెంట్ మంగళవారం పోలీస్ పరేడ్ లో ముఖ్య అతిథిగా టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్ రావు సమావేశ మందిరంలో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు 24/7 సేవలందించడం కాకుండా వారి ఆరోగ్యాన్ని చుకోవాల్సిన అవసరం ఉందని, ప్రతి ఒక్కరు ఉద్యోగుల ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కామారెడ్డి ఎస్ఈ రమేష్ బాబు, టిఎల్సి ఎస్ ఈ సూర్యనారాయణ, జగన్నాథ్ స్పోర్ట్స్ ఆఫీసర్, తోట రాజశేఖర్ వర్కింగ్ ప్రెసిడెంట్ స్పోర్ట్స్ కౌన్సిల్ జి.గంగారాం, సెక్రటరీ స్పోర్ట్స్ కౌన్సిల్ సురేష్ కుమార్, నిజామాబాద్ జిల్లా ఫుట్‌బాల్ కెప్టెన్ సురేష్ కుమార్ ప్రతిజ్ఞ చేశారు. సిఎండి స్పోర్ట్స్ మీట్ టోర్నమెంట్‌ని డిక్లేర్ చేశారు. వర్ష భావం వలన ఫుట్బాల్ మ్యాచ్ మంగళవారం నిలిపివేసి తరువాత రోజుకు వాయిదా వేశారు. క్యారమ్స్ పోటీలు నిర్వహించారు.



ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు

తెలంగాణలో రైతులే మహారాజులు

స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-వర్ని(మోస్రా)

గత పాలకుల హయాంలో రైతులకు కరెంట్ కోతలతో పంట చేలకు రాత్రి, పగలు తిరిగి కరెంట్ షాకుల తో మృతి చెందిన ఘటనలు చూశానని ప్రస్తుతం బీఆర్ఎస్ హయాంలో మన దగ్గరే రైతులే మహారాజులు అని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం వర్ని మండలం జాలాల్ పూర్, మోస్రా మండల కేంద్రాలలో "రైతే రాజు "అనే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో అయన మాట్లాడుతూ 75 ఏండ్ల కాంగ్రెస్, ఇతర పార్టీల పాలనలో రైతులు మోటార్ వేసుకోవాలన్నా, ట్రాన్స్ఫార్మర్ పెట్టాలన్న మంత్రుల నుంచి ఫోన్ చేయించుకునే దుస్థితి ఉండేదని, రైతులు కరెంట్ స్తంభాలకు, వైర్ల కోసం నాయకుల చుట్టూ కాళ్ళు అరిగేలా తిరిగే వారని తెలిపారు. పనికి రాని మాటలు చెప్పటం, ప్రజలను మోసం చేయటమే ప్రతిపక్షాలు పనిగా పెట్టుకొన్నారని వారికి ప్రజలు, రైతులు బుద్ధి చెప్పాలని రైతులతో సమావేశం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి పోచారం సురేందర్ రెడ్డి, జడ్పీటీసీలు గుత్ప భాస్కర్‌రెడ్డి, హరిదాస్, ఎంపీపీ లు పిట్ల ఉమా శ్రీరాములు, ఏ ఎం సి చైర్మన్ మూడ్ కవిత అంబర్ సింగ్, మేక శ్రీలక్ష్మి విరాజ్, వైస్ ఎంపీపీ లు దండ్ల బాలరాజు, కత్తి శంకర్, రైతు సమాన్వయ సమితి అధ్యక్షులు పిట్ల రాములు, గంగారాం, సర్పంచ్ లు తిప్పారం అనిత వెంకట్ గౌడ్, సుమలత రాంరెడ్డి, గోవూర్ సర్పంచ్ నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

పకడ్బందీగా ఓటర్ల జాబితా రూపొందించాలి

కలెక్టర్ జితేశ్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)

ఓటర్ల జాబితా రూపకల్పన పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం ఎన్నికల అధికారులకు ఓటర్ల జాబితా రూపకల్పనపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రెండవ విడత ఓటరు జాబితా సవరణలో భాగంగా డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదల ముందు వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలన పూర్తి చేయాలని అన్నారు. ఓటరు జాబితా నుంచి తొలగించిన ఓటరు వివరాలను క్షేత్రస్థాయిలో మరోసారి ధ్రువీకరణ పూర్తి చేయాలని చెప్పారు. ఇంటింటి సర్వే నేపథ్యంలో వచ్చిన దరఖాస్తులు, ఆన్ లైన్ ద్వారా ఫారం-6, 7,8 కింద వచ్చిన దరఖాస్తులను జులై 27వ తేదీ నాటికి క్షేత్ర స్థాయిలో పరిశీలన పూర్తి చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపుల ఏర్పాటు, లైటింగ్, తాగునీరు, ఫర్నీచర్, పురుషులకు, స్త్రీలకు ప్రత్యేకంగా మరుగుదొడ్లు ఉండే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఓటర్ల సంఖ్య 1500 కన్నా ఎక్కువ ఉంటే నూతన పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. డిక్లరేషన్ లో దరఖాస్తు దారుడు పేర్కొన్న సమాచారం అసత్యమైనదని తెలిస్తే ప్రజాస్వామ్య ప్రాతినిధ్య చట్టం 1950 ప్రకారం జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశముందని అన్నారు.

ఈ శిక్షణా కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, ఆర్.డి.ఓ. శ్రీనివాస్ రెడ్డి, కలెక్టరేట్ ఏ.ఓ. రవీందర్, జిల్లా ఎన్నికల సూపరింటెండెంట్ సాయి భుజంగ రావు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్

25న స్పోర్ట్స్ స్కూల్ రాష్ట్ర స్థాయి ఎంపికలు

- జిల్లా యువజన క్రీడల అధికారి ముత్తన్న

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఈనెల 25న 4వ, 5వ తరగతి స్పోర్ట్స్ స్కూల్ రాష్ట్ర స్థాయి ఎంపికలను హకీంపేట్, మేడ్చల్, మల్కాజ్‌గిరిలో నిర్వహించనున్నటు జిల్లా యువజన క్రీడల అధికారి ముత్తన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్ హకీంపెట్ ఆదేశాల మేరకు, జిల్లా కలెక్టర్ అనుమతితో తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్స్ ఆదిలాబాద్, కరీంనగర్, హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్ నందు 4వ, 5వ తరగతులలో అడ్మిషన్ కొరకు జిల్లా స్థాయి సెలెక్షన్స్ ఈనెల 11, 15 రోజున రాజారాం స్టేడియంలో నిర్వహించగా.. ఎంపికైన విద్యార్థులను ఈనెల 25న వెళ్లనున్నట్టు వివరించారు.

నవతెలంగాణ

నిజామాబాద్

2

బుధవారం 19 జులై 2023

బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటే..

నవతెలంగాణ-వేల్పూర్

బీఆర్ఎస్, బీజేపీ రెండు ఒక్కటేనని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. వేల్పూర్ పెద్దవాగుపై నిర్మించిన వంతెన కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించామని ఎంపీ అరవింద్ అంటుంటే.. రాష్ట్ర నిధులతో నిర్మాణం చేసినట్లు స్థానిక మంత్రి ప్రశాంత్ రెడ్డి చెబుతున్నారని, కమీషన్లలో పంపకాలు తేడా వచ్చి ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారని అన్నారు. సమావేశంలో మండల అధ్యక్షులు గడ్డం నర్సారెడ్డి, జిల్లా జనరల్ సెక్రెటరీ దామోదర్ గౌడ్, వేల్పూర్ టౌన్ ప్రెసిడెంట్ పన్నాల మల్లేష్, మండల కోశాధికారి రేవంత్ గంగయ్య, బీసీ మండల ప్రెసిడెంట్ రమణ, జంగన్న, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

పలు మండలాలకు నూతన ఎస్ఐలు

నవతెలంగాణ-విలేకరుల బృందం

భీంగల్ ఎస్ఐగా హరిబాబు..



భీంగల్ : భీంగల్ ఎస్సైగా హరిబాబు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన రాజ్ భరత్‌రెడ్డి నిజామాబాద్ ట్రాన్స్‌కో విజిలెన్స్ విభాగానికి బదిలీపై వెళ్లగా ఆదిలాబాద్ రూరల్ టౌన్ నుంచి హరిబాబు ఇక్కడికి బదిలీపై వచ్చారు. గ్రామాలలో యువకులు చెడు వ్యసనాలకు బానిసకాకుండా ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

జక్రాన్‌పల్లి ఎస్ఐగా తిరుపతి..



జక్రాన్‌పల్లి : జక్రాన్‌పల్లి ఎస్సైగా తిరుపతి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. నిజామాబాద్ నగరంలోని నాలుగో టౌన్ ఎస్ఐగా పనిచేసిన ఆయన ఇక్కడకు బదిలీపై రాగా.. ఇదివరకు ఇక్కడ విధులు నిర్వర్తించిన ఎస్ఐ శ్రీకాంత్ నిర్మల్ జిల్లాకు బదిలీ అయినట్టు సమాచారం.

మోపాల్ ఎస్సై మహేష్ బదిలీ..



మోపాల్ : మోపాల్ ఎస్సై మహేష్ కుమార్ నిజామాబాద్ రూరల్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. గత సంవత్సరం కాలం నుంచి మోపాల్‌లో విధులు నిర్వహిస్తున్న తనకు మండలంతో మంచి అనుబంధం ఏర్పడిందని ఎస్సై తెలిపారు.

ఇంటర్ ఫస్టియర్‌లో స్పాట్ అడ్మిషన్లు

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో ఉన్న మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో ఇంటర్ ఫస్టియర్‌లో చేరేందుకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నహీన ఫిర్దోస్ మంగళవారం తెలిపారు. ఎంపీసీ, బైపీసీలో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా 5వ తరగతిలో మిగిలిన సీట్లు భర్తీ చేస్తామన్నారు. కళాశాలలో ఖాళీగా ఉన్న ఇంగ్లీష్ కెమిస్ట్రీ, పీజీటీ పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ప్రొసిడింగ్ పత్రాలు అందజేత

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని పలు గ్రామాల కుల సంఘాలకు రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ రూ.50లక్షల విలువగల ఎస్‌డీఎఫ్ ప్రొసిడింగ్ పత్రాలు అందజేశారు. తొర్లికొండ గ్రామానికి చెందిన గౌడ సంఘం కమ్యూనిటీ హాల్‌కు 10 లక్షల రూపాయలు, అర్గుల్ గ్రామానికి చెందిన మాల సంఘం కమ్యూనిటీ హాల్ కోసం 7.50లక్షల రూపాయలు, అలాగే మాదిగ సంఘం కమ్యూనిటీ హాల్ కోసం 7.50.లక్షల రూపాయలు, జక్రాన్‌పల్లి గ్రామానికి చెందిన ఎస్సీ మాల కమ్యూనిటీ హాల్ కోసం 25లక్షల ఎస్‌డీఎఫ్ ప్రొసిడింగ్ పత్రాలను రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచులు, ఉప సర్పంచ్లు, కులాల సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దళిత రత్న అవార్డు గ్రహీతలకు సన్మానం

నవతెలంగాణ-ముప్కాల్

డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బీఆర్.అంబేద్కర్ జయంతి ఉత్సవాల కమిటీ ద్వారా జిల్లా కేంద్రంలో ఈ నెల 11న అణగారిన వర్గాల దళిత సమాజం కోసం పని చేసిన వ్యక్తులను గుర్తించి దళిత రత్న అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా మంగళవారం ముప్కాల్ మండల కేంద్రంలోని మణికంఠ గార్డెన్‌లో బాల్కొండ ఇంచార్జి మోతె భూమన్న ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన టీఎమ్మార్పీఎస్ కోర్ కమిటీ సభ్యులు రేణికుంట నాంపల్లి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దళిత రత్న అవార్డ్స్ స్వీకరించినవారు ఉంగరాల రాజేశ్వర్, బాల్కొండ ఎమ్మార్పీఎస్ టీఎస్ మండల అధ్యక్షులు, సుంకపల్లి ప్రకాష్, భీంగల్ మండల అధ్యక్షులు, కడారి శ్రీనివాస్, పత్రి రాజేశ్వర్ కోమన్‌పల్లి, సర్పంచ్ సప్న, కమ్మర్‌పల్లి మండల అధ్యక్షురాలు సల్లూరి శ్రీనాథ్, వేల్పూర్ టి.సాయన్న, చేపూర్ సర్పంచ్‌లు దళితరత్న అవార్డులను స్వీకరించినట్టు సంఘం అధ్యక్షులు గద్దల లాలయ్య, బడుగు సురేష్ పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన కోర్ కమిటీ సభ్యులు రేణికుంట నాంపల్లి మాట్లాడుతూ.. దళితుల అభ్యున్నతి కోసం, దళిత హక్కుల కోసం, ఎస్సీ వర్గీకరణ జరగే వరకు ముందుండి పోరాడాలని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ సలంద్ర బాబురావు, మాదిగ మహిళ రాష్ట్ర నాయకురాలు పోసాని, జిల్లా ఇంచార్జ్ సల్లూరి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు గుండారం మోహన్, జిల్లా మహిళా అధ్యక్షురాలు సిద్దంకి లత, టీఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ చేసిన ఎంఈఓ

నవతెలంగాణ-బోధన్

రెండవ విడత నోటు పుస్తకాల పంపిణీలో భాగంగా మంగళవారం బోధన్ ఎంఈఓ నాగనాథ్ బోధన్, సాలూర మండలాలకు చెందిన ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. రెండవ విడతలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థిని విద్యార్థులకు 37,200 నోట్ పుస్తకాలు ఎంఈఓ కార్యాలయానికి వచ్చాయని, 6, 7 తరగతుల విద్యార్థులకు ఆరు చొప్పున, 8వ తరగతి విద్యార్థిని విద్యార్థులకు 7నోటు పుస్తకాలు 9, 10వ తరగతుల విద్యార్థులకు 14 నోటు పుస్తకాలు విద్యా వనరుల కేంద్రం బోధన్ నుంచి ప్రధానోపాధ్యాయులకు పంపిణీ చేసినట్టు మండల విద్యాధికారి నాగనాథ్ తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సురేష్ కుమార్, సునీత, కిషన్, సీఆర్‌పీలు విజయ్, బాబు, విజయ పాల్గొన్నారు.

పుస్తకాలు అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్

బీజేపీ పట్టణ అధ్యక్షులు జెస్సు అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ప్రధాని మోడీ తొమ్మిది సంవత్సరాల సేవా, సుపరిపాలన, పేదల సంక్షేమం సంబంధించిన విషయాలను తెలియజేస్తూ మంగళవారం పట్టణంలోని మయూరి బీడీ ఫ్యాక్టరీ అధినేత వేముల రమేష్, విద్యా పాఠశాల యజమాని గోపి పట్వారి, రాష్ట్రపతి అవార్డు గ్రహీత, నటరాజ నృత్యానికేతన్ వ్యవస్థాపకులు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు మాడవీడి నారాయణ, ముదిరాజ్ సంఘం మాజీ అధ్యక్షులు మందుల బాల్ కిషన్, జెండా పంతులు కృష్ణ శర్మ, డాక్టర్ పొద్దుటూరి జగదీశ్వర్ రెడ్డి, డాక్టర్ పడాల్ అనిల్, డాక్టర్ హరి నారాయణ, విశ్రాంత ఉపాధ్యాయులు కాట్పల్లి రామ్‌రెడ్డిని కలిసి పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెత్తను తొలగించిన సర్పంచ్, పాలకవర్గం

నవతెలంగాణ-జుక్కల్



జుక్కల్ మండలకేంద్రంలో గత పన్నెండు రోజులుగా జీపీ కార్మికులు సమ్మెలో ఉండటంతో గ్రామంలో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది. వర్షాకాలం నేపథ్యంలో మరింత దుర్గంధం వ్యాపిస్తుండటంతో సర్పంచ్ బొంపెలి రాములు ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు కలిసి చెత్తను ట్రాక్టర్ నింపి డంపింగ్ యార్డుకు తరలించారు. సర్పంచ్ చొరవను గ్రామస్తులు అభినం దించారు. జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించి వారి సమ్మె విరమింపజేయాలని ప్రభుత్వాన్ని గ్రామస్తులు కోరుతున్నారు. చెత్త తొలగింపు కార్సక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు అయిల్ వార్ శకుంతల, హన్మవ్వ, సవిత, రమేష్, రాజు, నాగ్ నాథ్, సునిత, కాశీరాం జీపీ సిబ్బంది మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

వెట్టి చాకిరి చేస్తున్నా పట్టదా..?

- కొనసాగుతున్న జీపీ కార్మికుల నిరవధిక సమ్మె

నవతెలంగాణ-విలేకరుల బృందం



వేల్పూర్‌లో కార్మికుల నిరసన



ఎడపల్లిలో వంటావార్పు

గ్రామాల్లో వెట్టి చాకిరి చేస్తున్న తమను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని గ్రామ పంచాయతీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జీపీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె 12వ రోజుకు చేరుకుంది.

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి..

బోధన్ టౌన్ : సుమారు నెలరోజులుగా గ్రామపంచాయతీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సమ్మె చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకుంటున్న పాపాన పోలేదని, చాలా సంవత్సరాలుగా కార్మికులు గ్రామపంచాయతీలో వెట్టి చాకిరీ చేస్తున్నారని ఐఎఫ్‌టీయూ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు పుట్ట వరదయ్య తెలిపారు. వారికి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగడం లేదని అన్నారు.

సఫాయిలతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలి..

నవీపేట్: గ్రామపంచాయతీ సిబ్బంది యూనియన్‌లతో ప్రభుత్వం చర్చలు జరిపి కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డీ మోహన్ రెడ్డి అన్నారు. మండలంలో సీఐటీయూ నాయకులు, సఫాయి కార్మికులను పోలీసులు మంగళవారం అక్రమ అరెస్టులు చేయడం హేయమైన చర్య అని అన్నారు. అరెస్ట్ అయిన సీఐటీయూ నాయకులు, కార్మికులకు మంగళవారం సంఘీభావం తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. పారిశుధ్య కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల కోసం సమ్మె చేస్తున్నారని బీజేపీ పార్టీ కార్మికుల పట్ల ఎల్లప్పుడు మద్దతుగా ఉంటుందని అన్నారు. అధికార యంత్రాంగం ఎమ్మెల్యేలు, మంత్రులు స్పందించి సఫాయి కార్మికులకు జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని అన్నారు. అంతకుముందు ఆయన అసిస్టెంట్ పోలీస్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడుతూ ఎక్కడ లేని విధంగా నవీపేట్‌లో సీఐటీయూ నాయకులను, కార్మికులను అరెస్టు చేయడం సరికాదని విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో బందెల ఆనంద్, సర్పంచ్ సరీన్, వంశీ మోహన్, రామకృష్ణ, రాజేందర్ గౌడ్, గణేష్, రమణారావు, బండారి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వంట వార్పుతో నిరసన

ఎడపల్లి : తమ న్యాయమైన డిమాండ్ల సాధన కొరకు చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని వారసంతలో వంటావార్పు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా కన్వీనర్ జంగం గంగాధర్ మాట్లాడారు. గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులతో పాటు బిల్ కలెక్టర్లను ఇతర సిబ్బందిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కుంట సంతోష్, రాజు, స్వామి, గరిగింట్ల శ్రీనివాస్, పద్మ, అబ్బవ్వ, సాయమ్మ, లింగం, లింగయ్య, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్ : గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు పెంచి క్రమబద్ధీకరించాలని సమ్మెలో భాగంగా మండల కేంద్రంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం రోడ్లు భవనాల శాఖ మంత్రి నివాసం వద్ద వినతిపత్రం అందజేసినట్టు రాష్ట్ర జేఏసీ కన్వీనర్ దాసు తెలిపారు. స్వచ్ఛ తెలంగాణలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారని వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు సవీణ్, భానుచందర్, సాయిలు, సంతోష్, సర్వర్ లక్ష్మి, గున్నావా, అంక్సాపూర్ భాగ్య, బండి పోచన్న, మోతి ఉప్పలయ్య, గంగారం తదితరులు పాల్గొన్నారు

జీవో 50 రద్దు చేసి సరైన వేతనం అందించాలి..

భీంగల్ : ప్రభుత్వం గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కారోబార్లు, వాటర్‌మెన్, కార్మికులకు జీవో 50ని రద్దు చేసి 60 ప్రకారం సరైన వేతనాలను అందించాలని కారోబార్ల సంఘం మండల అధ్యక్షుడు శ్రీపాద బాలయ్య కోరారు. పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెలో భాగంగా బాలయ్య మాట్లాడారు. సమ్మెలో జిల్లా అధ్యక్షుడు గుర్రపు రాజేశ్వర్, కారోబార్లు ముత్తెన్న, రాజన్న, నర్సయ్య, రమేష్, మేస రమేష్ కార్మికులు పాల్గొన్నారు.

తెరపివ్వని వర్షం

- కుంటలా తలపిస్తున్న ప్రభుత్వ కార్యాలయాలు
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు

నవతెలంగాణ-విలేకరుల బృందం



భీంగల్ : పాఠశాల ఎదుట చేరిన వర్షపు నీరు



ఆర్మూర్ పట్టణంలో రోడ్డుపై నిలిచిన నీరు

సోమవారం రాత్రి నుంచి మంగళవారం రోజంతా తెరపివ్వకుండా వర్షం కురిసింది. దీంతో పలు ప్రభుత్వ కార్యాలయాలు నీరు నిలిచి కుంటలను తలపించాయి. ఇక పలు వాగులు, చెరువులు పొంగిపొర్లాయి.

భీంగల్ : కురుస్తున్న తేలికపాటి వర్షానికి పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల ముందు వర్షపు నీరు చేరి రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. దీంతో కార్యాలయాలకు వచ్చే ప్రజలు తంటాలు పడుతున్నారు. పట్టణ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గల యంఈఓ కార్యాలయం ముందు వర్షపు నీరు చేరడంతో అటుగా వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే బోయిగల్లిలో గల బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధాన ద్వారం వద్ద వర్షపు నీరు చేరడంతో విద్యార్థుల అదే మురికి నీటి నుంచి నడవడం తప్పలేదు. ఓ పక్క సీజనల్ వ్యాధుల గూర్చి అవగాహన కల్పిస్తున్నా అందుకు కారణమైన సమస్యలపై సంబంధిత అధికారులు దృష్టి పెట్టడం లేదు. కనుక సంబంధిత అధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

తానాకుర్దు గ్రామంలో పొంగిపొర్లుతున్న వాగు

మోపాల్ : మండలంలోని తానాకుర్ద్ గ్రామంలో వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. వర్షం వల్ల కర్షకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మొన్నటి వరకు వర్షాలు లేక అతలాకుతలమైన రైతులు బోర్లలో కూడా వాటర్ తగ్గిడంతో నిరాశకు గురయ్యారు. గ్రామంలో ప్రవహించే వాగు పెద్ద మొత్తంలో పారడం వలన తమ బోరు బావుల్లో గ్రౌండ్ వాటర్ పెరిగి అవకాశముందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చినుకు పడితే చిత్తడే

ఆర్మూర్ : మున్సిపల్ పరిధిలోని పలు వార్డులలో చినుకు పడితే చాలు రోడ్డు పూర్తి చిత్తడిగా మారుతుంది. మంగళవారం కురిసిన వర్షంతో మున్సిపల్ పరిధిలోని యోగేశ్వర కాలనీ, సరస్వతినగర్, విజయ్ హై స్కూల్ నుండి ఎంజే హాస్పిటల్‌కు వెళ్లే దారి వీటితో పాటు పలు కాలనీలలో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. పలుమార్లు కాలనీల వాసులు సంబంధిత మున్సిపల్ అధికారులకు, ప్రజాపతినిధులకు తెలిపిన పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో రోడ్లపై కాళీ నడకన కూడా వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు కాలనీల వాసులు అంటున్నారు.

పెద్దవాగులో జలకళ..

లింగంపేట్ : ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో మంగళశారం సాయంత్రం పెద్దవాగులోకి కొత్తనీరు ప్రవేశించి జలకళను సంతరించుకుంది. ఇన్ని రోజుల పాటు వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఎండిపోయిన పెద్దవాగు.. తాజాగా కురుస్తున్న వర్షాలతో జలకళను సంతరించుకుంది. గత సంవత్సరం ఖరీఫ్ సీజన్ ప్రారంభం జూన్ మాసంలోనే పెద్ద వాగు లో ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురవడంతో నీరు ప్రవహించింది. జూలై 10వ తేదీ నాటికి భారీ వర్షాలు కురవడంతో నాలుగు సార్లు పెద్ద వాగు పొంగి పొర్లింది. ఈ సంవత్సరం పెద్ద వాగు ఇప్పుడే నీరు ప్రవహించడంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



మోపాల్ : తానాకుర్దులో ప్రవహిస్తున్న వాగు



లింగంపేట్ : ప్రవహిస్తున్న పెద్దవాగు

ఇసుక క్వారీలను తనిఖీ చేయాలి

- అక్రమ రవాణా ఉండొద్దు
- జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఇసుక క్వారీలను ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని, అక్రమ రవాణా జరుగకుండా చూసుకోవాలని మైన్స్ శాఖా అధికారికి జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు సూచించారు. మంగళవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో జడ్పీ వైస్ చైర్‌పర్సన్ రజిత ఎల్లయ్య యాదవ్ అధ్యక్షతన స్థాయి సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు శాఖల పనుల ప్రగతిపై సంబంధిత అధికారులను జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అందరికీ అందేవిధంగా కృషిచేయాలని, సొసైటీలలో అవకతవకలు జరుగకుండా, విధిగా అడిట్ జరిగేటట్లు రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని డీసీఓను ఆదేశించారు. వర్షాకాలమైనందున జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా పరిశుభ్రతను పాటించాలని, మురికి నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యత గ్రామ పంచాయతీలు తీసుకోవాలని డీపీవోకు ఆదేశించారు. ఇసుక క్వారీలని ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని, అక్రమ రవాణా జరుగకుండా చూసుకోవాలని మైన్స్ శాఖా అధికారికి సూచించారు. సమావేశంలో సీఈవో గోవింద్, జెడ్పీటీసీ సభ్యులు రుద్రూర్ నారోజి గంగారాం, సిరికొండ మాన్సింగ్, జడ్పీటీసీ సభ్యులు నిజామాబాద్ సుమలత, కో-ఆప్షన్ సభ్యులు సిరాజ్, డీఆర్డీఏ పీడీ చందర్ నాయక్, డీపీఓ జయసుధ, మైన్స్ ఏడీ సత్యనారాయణ, డీఎస్ఓ చంద్ర ప్రకాష్, డీసీఓ సింహాచలం, సుందర వరదరాజన్, వ్యవసాయ శాఖ, ఫారెస్ట్, ఉద్యానవన శాఖ, వెటర్నరీ శాఖ, విద్యుత్ శాఖ, అధికారులు పాల్గొన్నారు.

నత్తనడకన డీఆర్‌సీసీ పనులు

- రెండేండ్లు గడుస్తున్నా అంతే..

నవతెలంగాణ-ఆర్మూర్

తడి పొడి చెత్తను వేరు చేసేందుకు మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ శివారులో మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పొడి వ్యర్థ వనరుల సేకరణ కేంద్రం డీఆర్‌సీసీ ఇంకనూ తుది దశలోనే ఉంది. ఇప్పటికే రెండు సంవత్సరాలకు పైగా సమయం తీసుకున్నా నిర్మాణం పూర్తి కాకపోవడం గమనార్హం.

ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో ప్రతిరోజు 30 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుండగా 20 మెట్రిక్ టన్నుల వరకు సేకరిస్తున్నారు. అందులో పెద్ద మొత్తంలో పాలిథీన్ వ్యర్థాలు ఉంటున్నాయి. డంపింగ్ యార్డ్ సమీపంలోని డీఆర్‌సీసీ నిర్మాణానికి రూ.20లక్షల వరకు నిధులు వెచ్చిస్తున్నారు. ఇప్పటివరకు పెద్ద మొత్తంలో పనులు అయిపోగా మరికొన్ని పనులు పెండింగ్లో ఉన్నాయి. బిల్లులు సకాలంలో రాకపోవడంతోనే పనుల్లో ఆలస్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది.

పట్టణంలో గుట్టలు గుట్టలుగా పేరుకుపోతున్న చెత్తతో పర్యావరణం కలుషితమవుతోంది. పాలిథీన్ వ్యర్థాల కట్టడికి చేపడుతున్న చర్యలు ఫలించక పోగా విస్తృతంగానూ ఉత్పత్తి అవుతుంది. అయితే ప్రస్తుతం తడి చెత్తతో కంపోస్ట్ ఎరువు తయారు చేస్తున్నారు. కానీ పొడి చెత్తను వేరు చేసే ప్రక్రియ సాగడం లేదు. అయితే డీఆర్‌సీసీ పనులు పూర్తయితే పొడి చెత్తను వేరుచేసే ప్రక్రియ పనులు సైతం ప్రారంభించే అవకాశం ఉంది. అందుకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

వేధిస్తోన్న వాహనాల కొరత..

చెత్త సేకరణకు ప్రధానంగా వాహనాల కొరత సైతం వేధిస్తుంది. మున్సిపల్‌లో 36 వార్డులకు సరిపడా వాహనాలు లేవని అధికారులు చెబుతున్నారు.



పూర్తికాని డీఆర్‌సీసీ పనులు

అందుబాటులోకి తీసుకువస్తాం

డీఆర్‌సీసీ నిర్మాణ పనులు తుది దశకు చేరాయి. కొన్ని పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. కాంట్రాక్టర్‌కు ఇదివరకే పూర్తి చేయాలని ఆదేశించాం. త్వరలోనే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటాం.

- భూమేశ్వర్, డీఈ మున్సిపల్ కార్యాలయం ఆర్మూర్.

అదనపు కలెక్టర్‌కు సన్మానం



నవతెలంగాణ-కామారెడ్డి/దోమకొండ

కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న వెంకటేష్ ధోత్రేను అధికారులు, ఉద్యోగులు సన్మానించారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జితేశ్ వి పాటిల్ మాట్లాడుతూ ఎంతటి క్లిష్టమైన సమస్యనైనా బ్యాలెన్స్ చేస్తూ ఓపికతో పరిష్కరిస్తూ వివిధ రంగాలలో జిల్లాను అభివృద్ధి పథంలో పయనింపజేయడంలో వెంకటేశ్ ధోత్రే సేవలు మరువలేనివని అన్నారు. వెంకటేష్ ధోత్రే మాట్లాడుతూ సత్యనారాయణ, శరత్, జితేష్ వి.పాటిల్ కలెక్టర్లతో పనిచేసే అదృష్టం కలిగిందని తెలిపారు. పనిలో ఒక్కొక్కరిది ఒక్కొక్క శైలి అని, వారిఆలోచనలకనుగుణంగా అధికారులు, సిబ్బంది సహకారంతో విధులు నిర్వహించానని అన్నారు. ధోత్రేను దోమకొండ జడ్పీటీసీ తీగల తిరుమల్‌గౌడ్ సన్మానించారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-మద్నూర్

కొత్తగా పట్టాపాస్ పుస్తకాలు పొందిన రైతులు రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని ఉమ్మడి మద్నూర్ మండల రైతులకు మండల వ్యవసాయ అధికారి రాజు సూచించారు. జూన్ 18వ తేదీలోగా పట్టాపొందిన వారు అర్హులని తెలిపారు. 18 నుంచి 59 సం.. వయస్సు లోపు గల రైతులు తమ ఆధార్ కార్డ్ లో పుట్టిన తేదీ ప్రకారం 14-8-1964 నుండి 14-8-2005 లోపు ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రైతు పట్టా పాస్ బుక్ కాపీతో పాటు ఆధార్‌కార్డు, నామినీ ఆధార్ కార్డు, నామినీ సేవింగ్ బ్యాంక్ ఖాతా పుస్తకంతో మీమీ ప్రాంతాల్లో ఏఈఓలకు ఆగస్టు5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే ఇంతకు ముందే రైతు బీమా చేసుకున్నా రైతుల తమ వివరాలు మార్పులు చేర్పులకు కూడా అవకాశం ఉందని, ఈ నెల వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంతకు ముందు బీమా చేసుకున్నా రైతులు మళ్ళీ దరఖాస్తు చేసుకోవాల్సినా అవసరం లేదని తెలిపారు.

మహిళలు ఆర్థికంగా పరిపుష్టి సాధించాలి

- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)/సదాశివనగర్

మహిళలు వ్యాపారాలు చేపట్టి ఆర్థికంగా పరిపుష్టిని సాదించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. కామారెడ్డి పట్టణంలోని రోటరీ క్లబ్‌లో మంగళవారం తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో మహిళ మహెూత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు వ్యవసాయంతో పాటు చేపల, తేనెటీగల, పాడిపరిశ్రమ, కోళ్ల పెంపకం, కూరగాయల సాగు, ఆయిల్ ఫామ్ వంటి వాటిని చేపట్టి ఆర్థికంగా బలోపేతం కావాలని చెప్పారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్రామీణ బ్యాంక్ చైర్మన్ వై.శోభ మాట్లాడుతూ అర్హత గల స్వయం సహాయక సంఘాలకు 20 లక్షల రూపాయల వరకు రుణాలు అందిస్తున్నామని అన్నారు. ఆర్థిక క్రమ శిక్షణతో మహిళలు అభివృద్ధికి బాటలు వేసుకోవాలని చెప్పారు. పొదుపు రికవరీ విషయంలో నిర్లక్ష్యం తగదని,



చెక్కు అందజేస్తున్న కలెక్టర్, బ్యాంక్ చైర్మన్ శోభ

ప్రభుత్వం అందించే వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామీణ బ్యాంక్ ద్వారా పంట రుణాలు, బంగారం పై రుణాలు గృహ రుణాలు వ్యక్తిగత ఋణం, విద్య ఋణం, మార్టిగేజ్ రుణాలు అందిస్తున్నామని అన్నారు. గృహ రుణంపై ఫిక్సెడ్ రేట్ ఆఫ్ ఇంటరెస్ట్, డిపాజిట్లపైన వడ్డీ రేట్లు అన్ని బ్యాంకులకంటే అధిక వడ్డీ రేటు అందిస్తున్నామని పేర్కొన్నారు. రైతులకు పంట రుణంతో పాటు ప్రత్యేకంగా రూపొందించిన రైతు నేస్తం రుణాలను, నీటిలో చేపల పెంపకంపై రుణాలు అందజే స్తున్నామని అన్నారు. ప్రతి ఒక్కరు ప్రధాన మంత్రి సామాజిక భద్రతా పథకాలలో చేరి ఆర్థిక భరోసా పొందాలని తెలిపారు. తెలంగాణా గ్రామీణ బ్యాంక్ 427 శాఖలలో 25 వేల కోట్ల రూపాయల వ్యాపారాన్ని అధిగమించడం జరిగిందని చెప్పారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్వయం సహాయక సంఘాలకు 35 కోట్ల రూపాయల రుణాలను అందజేశారు. ఈ కార్యకమంలో రీజనల్ మేనేజర్ పురం నవీన్, డిఆర్ డిఓ సాయన్న, లీడ్ బ్యాంక్ మేనేజర్ సుధీర్ భార్గవ్, డి.పి .ఎం. రవీందర్, గ్రామీణ బ్యాంక్ అధికారులు, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మహిళా మహెూత్సవం

సదాశివనగర్: తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో కామారెడ్డి లో మంగళవారం మహిళా మహెూత్సవం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ముఖ్యఅతిథిగా హాజరై పాల్గొన్నారు. మహెూత్సవ కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక సంఘాలకు సదాశివనగర్ మండలం ఉత్తునూరు బ్రాంచ్ తరపున కోటి 24 లక్షల రూపాయల రుణాలను జిల్లా కలెక్టర్ జితిష్ వి పాటిల్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ చైర్మన్ శోభ చేతుల మీదుగా అందించారు. మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థిక అభివృద్ధి సాధించాలని అన్నారు. ఉత్తునూర్ బ్యాంకు పరిధిలో ప్రమాదవశాత్తు మరణించిన ఆరు కుటుంబాలకు పి ఎం జె జె బి వై పీఎం ఎస్ బీ వై క్లైమ్ కింద కుటుంబానికి రెండు లక్షల చొప్పున 12 లక్షల రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ పురం నవీన్, డిఆర్డిఏ సాయన్న, ఉత్తునూర్ బ్యాంక్ మేనేజర్ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానాలతో కడుపునిండదు

- జీపీ కార్మికులకు కనీస వేతనం చెల్లించి పర్మినెంట్ చేయాలి : గ్రామ పంచాయతీ కార్మికుల సంఘాల జిల్లా చైర్మన్ వెంకట్ గౌడ్ డిమాండ్



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, కార్మికులు

నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ది వారోత్సవాల్లో భాగంగా ఒకరోజు గ్రామ పంచాయతీ కార్మికులకు సన్మానం చేసిందని, శాలువాలు కప్పి సన్మానం చేస్తే కడుపునిండదని, కనీస వేతనం అమలు చేసి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని జిల్లా గ్రామ పంచాయతీ కార్మికుల సంఘాల చైర్మన్ వెంకట్ గౌడ్ డిమాండ్ చేశారు. జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కామారెడ్డిలో విప్ క్యాంప్ ఆఫీస్ ఎదుట మంగళవారం ధర్నా చేపట్టారు. వెంకట్ గౌడ్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులు కరోనా సమయంలో ప్రాణాలను లెక్కచేయకుండా ప్రజలకు సేవ చేశారని అలాంటి గ్రామపంచాయతీ వర్కర్స్ ను పట్టించుకోకుండా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కుంపటి ప్రేమ నటిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. వారు 13 రోజులుగా సమ్మె చేస్తున్నా కనీసం చర్చలకు పిలవకపోవడం దారుణమని మండిపడ్డారు. వెంటనే గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేసి వారికి కనీస వేతనాలు అమలు చేయాలని మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని న్యాయమైన డిమాండ్ల ను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలనర్సు, యాదగిరి, స్వామి, సాయిలు, శ్యాం, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

జన ఆరోగ్య సమితిలను బలోపేతం చేయలి

- డిప్యూటీ డీఎంఅండ్ హెచ్ఓ శిరీష

నవతెలంగాణ-పిట్లం

జన ఆరోగ్య సమితిలను బలోపేతం చేయాలని డిప్యూటీ డి ఎం అండ్ హెచ్ ఓ శిరీష అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సాయి ఫంక్షన్ హాల్‌లో పిట్లం , నిజాంసాగర్ మండలాల వైద్య సిబ్బందికి ఓరియంటేషన్ ట్రెనింగ్ సమావేశం నిర్వహించారు. ఈ



మాట్లాడుతున్న శిరిష

సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్ఎచ్‌సి, పీహెచ్‌సి, యుహెచ్‌డబ్ల్యూసి యూపీ హెచ్‌సి, స్థాయి ఆరోగ్య సంక్షేమ కేంద్రాలలో సమయానుకూలంగా రోగుల సమస్యలను పరిష్కరించుటకు జేఏసీ సమస్యల పరిష్కార వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. సంబంధిత ఎబి , హెచ్ డబ్ల్యూ సి పనితీరుకు మద్దతు నిచ్చుట జేఏసీ ప్రధాన పాత్ర వహిస్తుందన్నారు. ఆసుపత్రులలో అందించే సేవల నాణ్యతను నిర్ణయిస్తూ ఆరోగ్య అభివృద్ధి , సమస్యల పరిష్కారం , సాంఘిక జవాబు దారి తనం ముఖ్య ఉద్దేశమన్నారు. రోగి సౌకర్యం, మందులు సరిగ్గా అందుబాటులో ఉండేటట్లు , వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉన్నాయా లేవా, సిబ్బంది ప్రవర్తన వాటిపై ఆరా తీస్తూ నాణ్యమైన సేవలు అందించుటకు కృషి చేయాలన్నారు. స్త్రీ , నవజాత శిశువు ఆరోగ్యము సేవలు అందేటట్లు చూడాలన్నారు. ఆయుష్మాన్ భారత్ లో భాగంగా పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్య సంక్షేమం పట్ల సేవలు అందేటట్లు చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యులు శివ కుమార్ , రోహిత్ కుమార్ , ఎంపీ ఓ బ్రహ్మాం ఐ సి డి ఎస్ అధికారులు , హెల్త్, ఎమ్ ఎల్ హెచ్ పి ఎస్ , ఏఎన్ఎం , ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-రాజంపేట్

మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ లింగాల స్వరూప అధ్యక్షతన నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో బాలకిషన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... మండలంలోని అధికారులు, ఎంపీటీసీలు సర్పంచులు ఈ సమావేశంలో పాల్గొవాలని ఆయన తెలిపారు.

సమస్యల పరిష్కారంలో ముందు..

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డిలో 8వ వార్డు మెంబర్ మోసర్ల శ్రీకాంత్‌రెడ్డి అన్ని తానై మురికి కాలువలను శుభ్రం చేస్తున్నాడు. మురికి కాలువలో పెద్ద హైడర్ అడ్డుగా ఉండటంతో చెత్తాచెదారం నిలిచిపోయింది. స్పందించిన ఆయన మంగళవారం వర్షాన్ని సైతం లెక్క చెయ్యకుండా సిబ్బందితో కలిసి హైడర్‌ను తొలగించారు.



బండరాళ్లను తొలగిస్తున్న వార్డు మెంబర్,సిబ్బంది

రోడ్డుపై పట్టీలు లేకుండా కేజ్‌వీల్ ట్రాక్టర్ నడిపితే చర్యలు

- సదాశివనగర్ సిఐ రామన్

నవతెలంగాణ-సదాశివనగర్

సదాశివనగర్ మండలంలోని తాడ్వాయి, గాంధారి, సదాశివనగర్ మండల గ్రామాల ట్రాక్టర్ యజమానులు రోడ్లపై కేజ్‌వీల్ టాక్టర్ పట్టీలు లేకుండా నడపరాదని ట్రాక్టర్ నడిపేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సదాశివనగర్ సిఐ రామన్ హెచ్చరించారు. మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ట్రాక్టర్ స్టార్ట్ చేసే ముందు ట్రాక్టర్ కు సంబంధించిన భాగాలు సరిగ్గా ఉన్నాయో లేదో చూసుకోవాలన్నారు. డ్రైవర్ తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని పొలం దున్నేటప్పుడు బురదలో చిక్కుకపోతే కేజీవిల్ ను క్రేన్ల సహాయంతో తీయకుండా ఇతర ట్రాక్టర్ సహాయంతో తీయాలన్నారు. కేజీవిల్ ట్రాక్టర్ రోడ్డుపై నడిపేటప్పుడు తప్పనిసరిగా పట్టీలు ఉండేలా చూసుకోవాలని లేదంటే కేసులు నమోదు చేస్తామని అన్నారు. రోడ్ పై కేజీవిల్ ట్రాక్టర్ తిరుగుతున్నట్టు కనిపిస్తే ప్రజలు, ప్రజాప్రతినిధులు పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు. రోడ్డు పాడు కాకుండా గ్రామ ప్రజలు మండల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.



మాట్లాడుతున్న సీఐ

సీఎం కేసీఆర్ కనికరించాలని అభిషేకం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

సీఎం కేసీఆర్ తమను కనుకరించేలా చూడాలని మధ్యాహ్న భోజన కార్మికులు ఎల్లారెడ్డిలో పట్టణ కేంద్రంలోని పోచమ్మ గుడిలో మంగళవారం అభిషేకం నిర్వహించారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని, 3000 రూపాయల గౌరవ వేతనం ఇస్తానన్న ముఖ్యమంత్రి హామీని నిలబెట్టుకోవాలని, కేరళ ప్రభుత్వం అందిస్తున్నట్టు ప్రభుత్వమే వంట సరుకులు అందిస్తామని టెండర్లు ప్రకటించినందున వంట సరుకులతో పాటుగాగ్యాస్ సిలిండర్ వంట పాత్రలు,కోడిగుడ్లు,తదితర అవసరమైనవి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సోఫియా, సాయులు, సంగీతం, గంగవ్వ, నిర్మల, దుర్గవ్వ, బధ్య నాయక్, పద్మ కమలి పాపవ్వ, అంజవ్వ, ఇంద్రవ్వ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సహాయం చేసిన ఎంపీటీసీ

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని మోడెగాం గ్రామంలోని రెండు రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు పూరి గుడిసె ఉరవడంతో నివాస గుడిసే బురద మయంగా మారింది. వర్షాలకు కుటుంబం బిక్కుమంటు రాత్రి నిద్ర హారం లేకుండా గడిపిన ట్లు తెలిపారు. ఈ విషయం తెలిసిన వెంటనే స్థానిక ఎం.పి.టి.సి జూకంటి సుజాత స్పందించారు. వెంటనే టార్పలిన్ కవర్ లు తెప్పించి గుడిసెపై కప్పారు. ఈ సందర్భంగా కుటుంబీకులు ఎంపిటిసి సుజాతకు, మాజీ సర్పంచ్ హెూటల్ బాలకృష్ణకు, గ్రామ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

రెండు పూటలా వ్యాయామం చేయించాలి

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండల కేంద్రంలోని భవిత ప్రత్యేక ప్రాథమిక పాఠశాలలో దివ్యాంగులైన పిల్లలకు డాక్టర్ సారిక వైద్యపరీక్షలు నిర్వహించారు.ఈక్యాంపు లో మొత్తం ఐదుగురు దివ్యాంగులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిరోజూ ఉదయం సాయంత్రం తల్లిదండ్రులు దివ్యాంగులకు వ్యాయామం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ టీచర్స్ పెంటయ్య, సాయన్న లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే షిండే ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరికలు



బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే షిండే

నవతెలంగాణ-మద్నూర్

జుక్కల్ నియోజకవర్గంలోని మద్నూర్ మండలములోని అవాల్గవ్ గ్రామనికి చెందిన ఇద్దరు కాంగ్రెస్ పార్టీ వార్డ్ మెంబర్లు, కార్యకర్తలు యువకులు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే హన్మంత్‌షిండే మంగళవారం వారికి కండువాలు కప్పిపార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి కెసిఆర్ చేస్తున్న అభివృద్ధి పథకాలు, అలాగే సంక్షేమ పథకాలు, రైతులకు అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధినీ చూసి వారు కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరినట్టు తెలిపారు. కార్యక్రమంలో మద్నూర్ మండల పార్టీ ప్రెసిడెంట్ బన్సి పటేల్, మద్నూర్ సర్పంచ్ సురేష్, సర్పంచ్ గఫర్, అవాల్గావ్ సర్పంచ్ శంతేశ్వర్ , అవల్‌గావ్ ఎంపీటీసీ సాయిలు, ఉప సర్పంచ్ మారుతి, అవాల్గావ గ్రామ పార్టీ అధ్యక్షులు నగేష్, మరియు విజయ్ కార్యకర్తలు, సర్పంచ్లు, ఎంపీటీసీలు, నాయకులు, యువ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయ మాజీ చైర్మన్‌కు పరామర్శ

మద్నూర్ మండలంలోని సలాబత్పూర్ దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ నర్సింలు గౌడ్‌ను మంగళవారం జుక్కల్ ఎమ్మెల్యే హనుమంతు సిండే పరామర్శించారు. కాలుకు గాయమైన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట హండేకేలూర్ ఎంపీటీసీ సభ్యుడు విజయ్ , బి ఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు మారుతి, మాజీ సొసైటీ డైరెక్టర్ కాజమీయా, యువకులున్నారు.

సంక్షేమ పథకాల అమల్లో దేశంలోనే నెంబర్‌వన్

- గులాబీ పార్టీ పుట్టిందే రైతుల కోసం
- ఎమ్మెల్యే జాజాల సురేందర్

నవతెలంగాణ-లింగంపేట్

'గులాబీ పార్టీ పుట్టిందే రైతుల కోసం. రైతుల సంక్షేమ పథకాల అమల్లో దేశంలో నెంబర్ వన్‌గా తెలంగాణ నిలిచింది. దేశ రాజకీయాల్లో కెసిఆర్ చక్రం తిప్పుతారని ఎల్లారెడ్డి శాసనసభ్యులు సురేందర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇస్తున్న 24 గంటల ఉచిత విద్యుత్‌పై అహంకారంగా మాట్లాడిన తెలంగాణ పిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి రైతులకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని పరమల్ల గ్రామంలోని రైతు వేదికలో రైతుల నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్రంలో 90 శాతం మంది రైతులే ఉన్నారని అన్నారు. నాటి బషీరాబాద్ సంఘటన నుండి తెలంగాణ ఉద్యమం మొదలైందని అన్నారు. ఆనాడే కెసిఆర్ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని బహిరంగ లేక రాశారని ఆయన గుర్తు చేశారు. నేడు రేవంత్ రెడ్డి 24 గంటల విద్యుత్ అవసరం లేదని కేవలం మూడు గంటలు కరెంటు వస్తే సరిపోతుందని దుహంకారపు మాటలు మాట్లాడారని ఆయన అన్నారు. వెంటనే రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పర్వయ్య, ఎఎంసి చైర్మన్ కాశినారాయణ, ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఒంటరి సిద్దారెడ్డి సింగిల విండో చైర్మన్ దేవేందర్ రెడ్డి,బి ఆర్ ఎస్ అధ్యక్షుడు రమేష్, వైస్ ఎంపీపీ విట్టల్ రెడ్డి, ఎంపీటీసీ రూప్సింగ్, మాజీ ఎఎంసి వైస్ చైర్మన్ నరహరి, మాజీ ఎంపీపీ సాయిలు సర్పంచులు అనిల్ రెడ్డి బండి రాజయ్య పోచయ్య, పద్మ గంగారెడ్డి, బన్నీ సక్రు సాయి కిరణ్, ఏఎంసి డైరెక్టర్ ఫాతియొద్దీన్, బిఆర్ఎస్, యువయూత్ అధ్యక్షుడు నరేష్, వివిద గ్రామాల సర్పంచ్ లు రైతులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్

భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఎస్ఐ డిసుధాకర్

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలంలో నిన్నటి నుంచి భారీ వర్షాలు కురుస్తుండటంతో మండల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని గాంధారి ఎస్సై డి.సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. పాత మట్టి గోడల ఇండ్లలో ప్రజలు నివాసం ఉండరాదని, కూలే అవకాశమున్న వాటికి దూరంగా ఉండాలని సూచించారు. విద్యుత్ స్తంభాలకు ఎలక్ట్రికల్ షాక్ వచ్చే అవకాశం ఉన్నందున వాటిని తాకరాదని, రైతులు పంట పొలాలకు వెళ్లే సమయం లోను విద్యుత్ స్తంభాలు మీటర్లు స్టార్టర్లను తాకొద్దని సూచించారు. వాగులు, కాలువలు వరద ప్రవాహంతో ఉన్నందున వాటిని దాటేందుకు ప్రయత్నించొద్దని, అవసరమైతే తప్ప ప్రయాణాలు వాయిదా వేసుకోవాలి సూచించారు. తీవ్ర వర్షా ప్రభావం ఉన్నందున పిల్లలు బయటకు వెళ్లకుండా చూసుకోవాలని, నీటిలో ఆడేందుకు సరదాగా వెళ్లి ప్రమాదాల బారిన పడే అవకాశం ఉన్నందున పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. నీటితో నిండి ఉన్న చెరువులు, కుంటల వద్దకు చూసేందుకు వెళ్లొద్దని, ఏదైనా అత్యవసరం ఉన్నట్లయితే డయల్ 100, పోలీస్ స్టేషన్ అధికారులకు సమాచారం ఇవ్వాలి ఎస్ఐ తెలిపారు.



వాగుపొంగుతుండటంతో రోడ్డుపై చెట్టుకొమ్మలు వేసిన పోలీసులు

రాహుల్ గాంధీ పై అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి

- ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వడ్డేపల్లి సుభాష్ రెడ్డి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

రాహుల్ గాంధీ పైన పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి పైన కేటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎల్లారెడ్డి కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి సుభాష్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కేటీఆర్ లాగా పబ్బులు పార్టీలు సినిమా తారలతో డ్రామాలు వేయడం రాహుల్‌గాంధీకి రాదని, భారత్ జోడో యాత్రతో దేశవ్యాప్తంగా పాదయాత్ర చేసి అన్ని సమస్యలను తెలుసుకున్న గొప్ప నాయకుడని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన దేవత సోనియ అని, అలాంటి గొప్ప రాజకీయ కుటుంబంలో పుట్టిన గొప్ప నాయకుడు రాహుల్ గాంధీ మీద అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునే ప్రసక్తి లేదని హెచ్చరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎక్కడ 24 గంటల కరెంటు ఇచ్చారో తెలపాలన్నారు. మా నాయకులు వెళ్లి సబ్ స్టేషన్ లో రికార్డ్ బుక్స్ చూస్తున్నారనే భయంతో బుక్కులను మాయం చేసిన గొప్ప ప్రభుత్వమని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో జనార్దన్ రెడ్డి, ఆఫీజ్, శ్రీనివాస్ రెడ్డి, నిల రవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుభాశ్‌రెడ్డి

అధిక శ్రావణమాస సప్త ప్రారంభం

నవతెలంగాణ-మద్నూర్/నసురుల్లాబాద్

మద్నూర్ మండలంలోని సలాబత్పూర్ ఆంజనేయ స్వామి పుణ్యక్షేత్రంలో మంగళవారం అధిక శ్రావణమాస సప్త కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ఆలయంలో అధిక మాసం నెలరోజులపాటు సప్త కొనసాగుతుందని ఆలయ కమిటీ మాజీ చైర్మన్ నర్సింలు గౌడ్ కాబోయే చైర్మన్ కాశీనాథ్ పటేల్ తెలిపారు. సప్త ప్రారంభోత్సవ కార్యక్రమంలో సలాబత్పూర్ గ్రామ సర్పంచ్ షేక్ గఫర్, హెచ్ కేలూర్ ఎంపీటీసీ సభ్యులు విజయ్ బి ఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షులు బన్సీ పటేల్, మద్నూర్ గ్రామ సర్పంచ్ సురేష్, ఉప సర్పంచ్ విట్టల్, ఆలయ అధికారి వేణు, ఆలయ మహారాజులు అరవింద్, శరత్, ఆలయ గుమస్తా కల్పన, గిరీష్, దేశాయ్, శ్రీపద్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



నసురుల్లాబాద్ మండలం దుర్కిలో..

దుర్కిలో హరినామ సంకీర్త

నసురుల్లాబాద్ : నసురుల్లాబాద్ మండలంలోని దుర్కి శ్రీ సోమా లింగేశ్వర ఆలయంలో మంగళవారం అధికమాస సందర్భంగా అఖండ హరినామ సప్తను ప్రారంభించారు. ఈ సప్త కార్యక్రమం ఒక్క నెల రోజుల పాటు సంకీర్త కార్యక్రమం కొనసాగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. అఖండ హరినామ సప్తా అంగరంగ వైభవంగా జరిగింది. రాష్ట్ర నాయకులు పోచారం సురేందర్‌రెడ్డి నేతృత్వంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో నెల రోజుల పాటు ఈ సప్తాహ వేడుకలు ఘనంగా నిర్వ హిస్తారు. కార్యక్రమంలో రాములు మహారాజ్ మైనవార్కరి, కిష్టాపూర్ సొసైటీ చైర్మన్ శ్రీనివాస్ యాదవ్, మాజీ జడ్పిటిసి కిషోర్ యాదవ్, మహేందర్ రెడ్డి, పత్కరి విఠల్, శ్రవణ్ కుమార్, పిట్ల సాయిలు విఠల్, మహారాజ్.వీరేశం నాందేవ్ మహారాజ్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఎంపీడీఓతో మృతి

నివాళి అర్పించిన అధికారులు, సిబ్బంది

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండల ఎంపిడిఓ కె నారాయణ సోమవారం రాత్రి గుండెపోటుతో హఠన్మారణం పొందారు. 8 నెలల క్రితం బిబిపేట్ నుండి ఎల్లారెడ్డికి ఇంచార్జ్ ఎంపీడీవోగా నారాయణ బాధ్యతలు స్వీకరించి విధులు నిర్వర్తిస్తున్నారు. హైదరాబాదులోని ఆల్వల్‌లోని తన నివాసంలో మృతి చెందారు. అతనికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.



ఎల్లారెడ్డి ఎంపీడీఓకు నివాళి

ఎల్లారెడ్డి మండల ప్రజాపరిషత్ ఎంపిడిఓ కె నారాయణ గుండెపోటు తో మృతి చెందడంతో మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు సిబ్బంది నివాళి అర్పించారు. వారి ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటించారు. ఎంపీపీ మాధవి, బాలరాజ్ గౌడ్, జడ్పీటీసీ ఉషా గౌడ్, మండలంలోని ఎంపిటిసి లు, సర్పంచులు, ఎంపిఓ ప్రకాష్ , పంచాయతీ కార్యదర్శులు మరియు కార్యాలయ సిబ్బంది నివాళి అర్పించారు.



ఎంపీడీవోకు నివాళి అర్పిస్తున్న సిబ్బంది

అన్నాబావు సాటేకు వర్ధంతి నివాళి



నివాళి అర్పిస్తున్న పలువురు

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్రంలో మంగళవారం డాక్టర్ అన్నాబావు సాటే 54వ వర్ధంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని సోనాల చౌరస్తాలో గల ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అన్న బావు సాటే సాహిత్యరంగంలో ఎనలేని కృషి చేసి, కార్మికులు కర్షకులు, మహిళల దేవాదాసి, జోగిని వ్యవస్థ, సమాజం లో స్త్రీలకు కు ఉన్న స్థానం, మహారాష్ట్ర స్వాతంత్ర సంగ్రామం, ప్రత్యేక ముంబై నగరం గురించి, మార్క్స్ ఆలోచనలను, అంబేద్కర్ ఆలోచనలను తన సాహిత్యం ద్వారా అందించారని గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో క్రవేవార్ లక్ష్మణ్, సాయిలు, వార్డు మెంబర్ బాలు యాదవ్, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు మరోతి క్రవేవార్, కొలవార్ పండరి, మరోతి గడ్డంవార్, రాజు గడ్డంవార్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

18 డ్రంకెన్‌డ్రైవ్ కేసులు నమోదు

● 30 మందికి కౌన్సెలింగ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ ఇన్చార్జి పోలీస్ కమిషనర్ నిర్మల్ ఎస్పీ ప్రవీణ్ ఆదేశాల మేరకు సోమవారం నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 18 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదైనట్లు ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్ తెలిపారు. ఈ మేరకు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 30 మందిపై కేసు నమోదు చేసుకొని మంగళవారం నగరంలోని జిల్లా టీటీఐ కౌన్సెలింగ్ సెంటర్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు.

ప్రశాంతంగా పరీక్షలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో మంగళవారం ఉదయం జరిగిన ఎంబీఏ, ఎంసీఏ 2వ రెగ్యులర్, బ్యాక్‌లాక్ సెమిస్టర్ పరీక్షలకు గానూ 629మంది విద్యార్థులకు గాను 588 మంది విద్యార్థులు హాజరయ్యారని, 41 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిని ప్రొఫెసర్ డాక్టర్ అరుణ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన ఎంబీఏ, ఎంసీఏ 4వ రెగ్యులర్, బ్యాక్‌లగ్ సెమిస్టర్ పరీక్షకు 475 మంది విద్యార్థులకు గాను 460 విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని, 15మంది విద్యార్థులు గైరాజరయ్యారని పేర్కొన్నారు. తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో మంగళవారం ఉదయం జరిగిన డిగ్రీ 5వ సెమిస్టర్ బ్యాక్‌లాక్ పరీక్షలకు 139 మంది విద్యార్థులకు గాను 105 హాజరయ్యారని 34 మంది గైరాజరయ్యారని వివరించారు.

వర్షంలో సైతం రిలే దీక్ష



దీక్షలో పాల్గొన్న రైతులు

నవతెలంగాణ-రెంజల్

తమ పంట పొలాలకు వెళ్లే రోడ్ల మరమ్మతులు చేపట్టాలని కోరుతూ చేస్తున్న రిలే దీక్ష 21వ రోజుకు చేరుకుంది. మంగళవారం ఉదయం నుంచి వర్షం పడుతున్నప్పటికీ గొడుగులు కప్పుకొని రైతులు దీక్షలో పాల్గొన్నారు. గుంతలమయమై నడుచుకుంటూ వెళ్లే పరిస్థితిలేని ఈ రోడ్ల మరమ్మతులు జరిపేవరకు రిలే దీక్షను కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు. కోటి యాభై నాలుగు లక్షల రూపాయలు మంజూరైనప్పటికీ అనివార్య కారణాలవల్ల రోడ్డు పనులు గత ఎనిమిది సంవత్సరాలుగా నిలిపివేశారని వారు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి యుద్ధ ప్రాతిపదిక పైన బంధాల రోడ్డు, మాచాపురం రోడ్డు పనులను పూర్తి చేయాలని వారు నినాదాలు చేశారు.

నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలి



ధర్నా చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-బోధన్‌టౌన్

నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలని శివసేన సేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పసులోటి గోపికిషన్ డిమాండ్ చేశారు. మంగళవారం శక్కర్‌నగర్‌లో గల నిజాంషుగర్ ఫ్యాక్టరీ గేటు ఎదుట వర్షాన్ని సైతం లెక్కచేయకుండా కార్మికులకు మద్దతుగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపి కిషన్ మాట్లాడుతూ.. ఆసియా ఖండంలోనే రెండవ అతిపెద్ద చక్కర కర్మాగారమైన నిజాంషుగర్ ఫ్యాక్టరీ లేఔట్‌ను ఎత్తివేయాలని కార్మికులను, రైతులను ఆదుకోవాలన్నారు.

విశ్వరూప మహాసభ విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న అశోక్

నవతెలంగాణ-ఎడపల్లి

ఆగస్టు రెండో వారంలో జరగబోయే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని నిజామాబాద్ జిల్లా ఇన్చార్జి అసనేపల్లి అశోక్ మాదిగ అన్నారు. మంగళవారం ఎడపల్లి మండల కేంద్రంలో గల ఎస్సీ కాలనీలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధనకై ప్రతి పల్లె ప్రతి వాడ ప్రతి ఇంటి నుంచి హైదరాబాద్‌లో జరగబోయే మాదిగల విశ్వరూపం మహాసభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో శనిగారపు మురళీకృష్ణ, స్థానిక మహిళా నాయకురాలు పిల్లంగోల సావిత్రి, బోధన్ నియోజకవర్గ నాయకులు లసింగారి భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన చిన్ననాటి స్నేహితులు



న్యాయమూర్తిని సన్మానించిన చిన్ననాటి స్నేహితులు

నవతెలంగాణ-ముప్కాల్

హైకోర్టు న్యాయమూర్తిగా లక్ష్మీ నారాయణ అలిశెట్టి నియామకం అయిన సందర్భంగా మంగళవారం ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన ఆయన చిన్ననాటి స్నేహితులు హైకోర్టు న్యాయమూర్తి లక్ష్మీ నారాయణ అలిశెట్టి నివాసానికి వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తిని శాలువాతో సత్కరించి అభినందనలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన స్నేహితులు మాట్లాడుతూ హైకోర్టు న్యాయమూర్తిగా ప్రజలకు మంచి సేవలను అందించాలని ఆకాంక్షించారు. ఆయనను కలిసి అభినందించిన వారిలో బ్రమ్మదండి గణేష్, బద్దం ముత్యం రెడ్డి, గడ్డం సురేష్‌రెడ్డి తదితరులున్నారు.

కూనేపల్లి ఉపసర్పంచ్‌గా ఈరవోని మల్లేష్



నవతెలంగాణ-రెంజల్

జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు మండలంలోని కూనేపల్లి ప సర్పంచ్‌గా ఈరవోని మల్లేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు సర్పంచ్ రొడ్డ విజయ లింగం తెలిపారు. ఉప సర్పంచ్‌గా పనిచేసిన పెట్రోల మొగులయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా ఉప సర్పంచ్‌గా ఆరవ వార్డు సభ్యుడు మల్లేష్‌కు పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎంపిక చేశారని ఆమె అన్నారు. సమావేశంలో సర్పంచ్‌తో పాటు గ్రామ కార్యదర్శి శివ కృష్ణ, పాలకవర్గ సభ్యులు గౌర, గైని లక్ష్మి, దుబ్బాక కళావతి, బోర్గం విజయ తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు కలుషితం కావొద్దు

● లోతట్టు ప్రాంతాలకు చేరే నీటిని దారి మళ్లించండి
● మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్
● మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం



మాట్లాడుతున్న మేయర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

వర్షకాలం దృష్ట్యా రాబోవు రెండు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాలకు చేరే నీటిని నాలాల ద్వారా దారి మళ్లించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని మేయర్ దండు నీతూ కిరణ్ అన్నారు. మంగళవారం నగరంలోని మున్సిపల్ కార్యాలయంలోని మేయర్ ఛాంబర్‌లో ఇంజనీరింగ్, శానిటేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.. అవసరం ఉన్న చోట్ల తాత్కాలిక కాలువలను తవ్వి నీరు నివాస సముదాయాలలో చేరకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలని తెలిపారు. వర్షపు నీరు మురికి కాలువల ద్వారా మళ్లించేప్పుడు ఎక్కడా తాగునీరు మురికి నీటితో కలుషితం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మంచి నీటి పైప్ లైన్ లీకేజీలను తక్షణమే అరికట్టాలని, వర్షాలతో పాటు ఇతర విష జ్వరాలు ప్రబలకుండా చూడాలని తెలిపారు. సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఎస్ఈ, ఎంఈ, డీఈలు, ఏఈలు, ఎంహెచ్ఓ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు శుభాకాంక్షలు

● మంత్రిని, మేయర్‌ను కలిసిన నూతన కమిషనర్

నవతెలంగాణ-వేల్పూర్/కంఠేశ్వర్

నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నూతన కమిషనర్ మకరంద్ రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని వేల్పూర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా నిజామాబాద్ మున్సిపల్ నూతన కమిషనర్ మకరందకు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా సంబంధిత అధికారులతో సహకారం తీసుకొని నిజామాబాద్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సూచించారు.



మంత్రికి మొక్కను అందజేస్తున్న కమిషనర్

మేయర్‌ను కలిసిన మున్సిపల్ కమిషనర్..

కంఠేశ్వర్ : నిజామాబాద్ నగర పాలక సంస్థ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన మంద మకరంద్ నిజామాబాద్ నగర మేయర్ దండు నీతూ కిరణ్‌ని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ దండు నీతూ కిరణ్ శుభాకాంక్షలు తెలియజేశారు.



మేయర్‌ను కలిసిన కమిషనర్..

ప్రతి ఒక్కరూ ఐదు మొక్కలు నాటాలి

నవతెలంగాణ-ఎడపల్లి

ప్రతి ఒక్కరూ తమ వంతుగా ఐదు మొక్కలను నాటి వాటి సంరక్షణ బాధ్యతలను తీసుకోవాలని సర్పంచ్ రాజ్యలక్ష్మి హనుమంతు అన్నారు. మండలంలోని జమలం గ్రామంలో ఉపాధి హామీ నర్సరీలో పెంచిన మొక్కలను సర్పంచ్ గొడుగు రాజ్యలక్ష్మి ఇంటింటికి పంపిణీ చేశారు. జామ, నిమ్మ, మామిడి ఇతర పూల మొక్కలను తోపాటు భావితరాలకు ఉపయోగపడే మొక్కలను ఆమె పంపిణీ చేశారు.

ఆచన్‌పల్లిలో షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

నవతెలంగాణ-బోధన్ టౌన్

బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లిలోని కాలనీలో మంగళవారం ఉదయం షాట్ సర్క్యూట్‌తో ఓ ఇల్లు దగ్ధమైంది. ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. రూ.లక్ష ఆస్తి నష్టం జరిగిందని కుటుంబీకులు తెలిపారు. చుట్టుపక్కల ప్రజలు భయాందోళనకు గురయ్యారు.



షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన ఫ్రిజ్

బాధితల ను పరామర్శించిన మున్సిపల్ చైర్మన్..

బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లి ఒకటో నెంబర్ వార్డులో షార్ట్‌సర్క్యూట్‌తో ఇంట్లో సామగ్రి పూర్తిగా కాలి పోవడంతో సుమారు లక్ష రూపాయల వరకు ఆస్తినష్టం వాటిల్లింది. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ తూము పద్మవతి ఘటనా స్థలానికి చేరుకొని బాధితురాలైన తాండ్రాల అనితను ఓదార్చారు. తూము శివమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కౌన్సిలర్ శరత్‌రెడ్డి నిత్యావసర వస్తువులు, నగదును ఆర్థిక సాయంగా అందజేశారు. ప్రభుత్వం ద్వారా కూడా వారిని ఆదుకుంటామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ శరత్‌రెడ్డి, శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాన్ని సైతం లెక్క చేయక..

● టీయూ కాంట్రాక్ట్ అధ్యాపకుల నిరసన
● రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్క చేయకుండా తెలంగాణ యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులు తమ న్యాయమైన డిమాండ్లను నేరవేర్చే విధంగా చూడాలని కోరుతూ మంగళవారం నిరసనను తెలిపారు. తెలంగాణలోని అన్ని యూనివర్సిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని ముఖ్యమంత్రి కెసిఆర్‌కు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం అధ్యక్షులు వి.దత్తాహరి మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీలకు చెందిన అధ్యాపకులను రెగ్యులరైజ్ చేసినట్టు యూనివర్సిటీలలో ఉన్న కాంట్రాక్ట్ అధ్యాపకులందరినీ రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్. సిహెచ్ శ్రీనివాస్, డేనియల్, డి.శ్రీనివాస్, శరత్, నాగేశ్వర్ రావు, గోపిరాజు, అపర్ణ, జ్యోత్స్న, సురేష్, స్వామిరావ్, నాగేంద్రబాబు, గంగాకిషన్, మోహన్, జలంధర్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు

జాతీయ నులిపురుగుల నివారణపై సమావేశం

నవతెలంగాణ-రెంజల్

మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధ్యాయులతో జూమ్ సమావేశాన్ని మంగళవారం నిర్వహించినట్టు ఎంపీడీవో శంకర్ పేర్కొన్నారు. ఈనెల 20న ప్రతి పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దీనికి స్థానిక ఉపాధ్యాయులు వైద్య సిబ్బందికి సహకరించాలన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తీర్ణ అధికారులు కరిపి రవీందర్, చింతాల శ్రావణ్ కుమార్ మాట్లాడారు. మండలంలో 19 సంవత్సరాల లోపు మగ పిల్లలు 6,688, ఆడపిల్లలు 7,590 మంది ఉండగా మొత్తం మండలంలో 14,278 మంది విద్యార్థులకు వైద్య సిబ్బంది ఆరోగ్య కార్యకర్తలు, ఆరోగ్య సూపర్వైజర్లు, ఆశవర్కర్లు పాఠశాలలకు వచ్చి ఉపాధ్యాయుల సమక్షంలో వాటిని అందిస్తారని వారన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా ఒక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ టీంను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సూపరిండెంట్ శ్రీనివాస్, ఇన్చార్జి మండల విద్యాశాఖ అధికారి కట్ట శ్రీనివాసరావు, ఎంపీఓ గౌస్‌ఉద్దీన్, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

సీఈఐఆర్ ద్వారా 27 ఫోన్లు రికవరీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ ఒకటవ పోలీస్‌స్టేషన్ పరిధిలో కేవలం 15 రోజుల్లోనే రూ.ఆరు లక్షల విలువచేసే సెల్‌ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా 27 మొబైల్ ఫోన్‌లను రికవరీ చేసినట్లు ఒకటవ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ విజయ్ బాబు మంగళవారం తెలిపారు. రికవరీ చేసిన సెల్ ఫోన్ లను బాధితులకు పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. ఈ సందర్భంగా ఒకటవ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ విజయ్ బాబు మాట్లాడుతూ.. సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్లను కొనేటప్పుడు ప్రజలు జాగ్రత్తగా వ్యవహరించాలని, దాని ఒరిజినల్ బిల్లు, అలాగే బాక్స్ సరిచూసుకొని కొనాలని విజ్ఞప్తి చేశారు. ఒకవేళ దొంగిలించిన ఫోన్లను కొంటె ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందని తెలిపారు. దొంగతనాలకు పాల్పడి ఫోన్లను తీసుకువచ్చి అమ్మే వారి వివరాలను పోలీసులకు సమాచారం ఇవ్వాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఒకవేళ సెకండ్ అండ్ ఫోన్లను కొంటే వారు కూడా దానికి బాధ్యత వహించాల్సిన అవసరం ఉంటుందని, కావున సెకండ్ హ్యాండ్ ఫోన్లను కొనకూడదని మొబైల్ షాప్ యజమానులకు అలాగే ప్రజలకు పలు సూచనలను తెలియజేశారు. సీఈఐఆర్ పోర్టల్ అందుబాటులోకి రావడంతో త్వరగా సెల్‌ఫోన్ కేసులను చేధిస్తున్నట్టు తెలిపారు.



అందజేసిన ఫోన్లతో బాధితులు

స్మైల్ పాఠశాలలో రెయిన్ డే సంబరాలు



రెయిన్‌డే సంబురాలు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని హౌసింగ్‌బోర్డ్ కాలనీ స్మైల్స్ పాఠశాలలో మంగళవారం రెయిన్ డే సంబు రాలు నిర్వహించారు. రెయిన్ కోట్స్ ధరించి.. రంగుల గొడుగులతో ఆడుతూ పాడుతూ వర్షంలో ఎంజాయ్ చేశారు. ఇందులో భాగంగా డాన్స్, ఇతర గేమ్స్ నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ప్రిన్సిపాల్ షబానా గౌహర్, డైరెక్టర్ రఫీ గోహర్, స్టాఫ్ సింధూర, సవిత, స్వప్న, విమల, ప్రసన్న, సింధూజ, సౌమ్య, శ్రావణి రోజా తదితరులు పాల్గొన్నారు.

రూ.కోటి రుణం మంజూరు

● 10 డ్వాక్రా సంఘాలకు అందజేత

నవతెలంగాణ-కోటగిరి

మండలంలోని ఎత్తొండ తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో మహిళ సంఘాలకు ఒకే రోజు రూ.కోటి రుణాన్ని మంగళవారం అందజేశారు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మహిళ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా 10 డ్వాక్రా సంఘాలకు ఒక కోటి రూపాయల రుణ వితరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ సుధాకర్, ఫీల్డ్ ఆఫీసర్ నరేష్, ఏపీఎం బస్వంత్‌రావు, సీసీ సాయిబాబా, విఠల్, లత, శకుంతల, మాధవి, సరిత, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



రుణాలు అందజేత

ముప్కాల్‌లో 34.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలో మంగళవారం ఉదయం వరకు 34.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ సిబ్బంది ఏఎస్వో నరేష్ తెలిపారు. వర్షపాత నమోదు సూచనకై రెవెన్యూ, విద్యుత్ అధికారులు సైతం పూర్తి సహకారం అందిస్తున్నారని అన్నారు. రానున్న రెండు రోజుల పాటు వాతావరణం ఒకేలా ఉంటుందని వివరించారు.

సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కూనేపల్లి సర్పంచ్ రొడ్డ విజయ లింగం సీఎం సహాయ నిధి చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. గ్రామానికి మూడు సీఎం సహాయనిధి చెక్కులు వచ్చినట్టు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మల్లేష్, కార్యదర్శి శివ కృష్ణ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఎస్ఐ సందీప్‌కు నాయకుల సన్మానం

నవతెలంగాణ-బోధన్

బోధన్ రూరల్ ఎస్ఐ సందీప్ బదిలీపై ఆదిలాబాద్‌కు వెళ్తుండడంతో మంగళవారం పలు గ్రామాల నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సాలంపాడ్ గ్రామ పెద్దలు నర్సారెడ్డి, తూము రవి, ఎంపీటీసీ వెంకట్రావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రవికిరణ్, ఎస్ఐ సందీప్‌కు జ్ఞాపిక అందించి సన్మానించారు. అలాగే కాంగ్రెస్ నాయకులు దొడ్ల రవీందర్‌రెడ్డి, బోధన్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ లోకం శ్రీనివాస్, బీజేపీ జిల్లా నాయకులు ముస్యాల హరికృష్ణ, బోధన్ బీజేపీ పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి కందికట్ల వాసు, బోధన్ నియోజకవర్గ జాగృతి కన్వీనర్ గట్టు హరికృష్ణ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాజా, కానిస్టేబుల్ గిరి ఎస్ఐ సందీప్‌ను సన్మానించారు.